# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 28-04-2025 | సంపుటి - 22 | సంచిక - 363 | రూ : 4 | పేజీలు: 8




## 53% మంది అనర్హులే..!

- ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో 41.15 లక్షల మందికి అర్హత లేదు..
- 36.03 లక్షల మంది మాత్రమే అర్హులు



2లో



2లో

## అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

- మీరేం చేశారో.. మేమేం చేస్తున్నామో ప్రతి అంశంపై మాట్లాడదాం
- కాళేశ్వరం ఈఎన్సీ అవినీతే రూ.200 కోట్లు.. కేసీఆర్ కుటుంబం ఎంత సంపాదించిందో?
- తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్‌లా కనిపిస్తోందా?
- కేసీఆర్‌పై మంత్రులు పొంగులేటి, సీతక్క, జూపల్లి, పొన్నం ధ్వజం

## పోరాటానికి మేం సై!



- భారత నౌకాదళం స్పష్టీకరణ
- విజయవంతంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు

2లో



## ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది

- 'పహల్గాం' బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుంది
- దాడి చేసినోళ్లను, కుట్రదారులను అత్యంత కఠినంగా శిక్షిస్తాం
- ప్రధాని మోదీ హామీ
- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే అతిపెద్ద బలమని వ్యాఖ్య
- కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే దాడి చేశారంటూ మండిపాటు

2లో




# తెలంగాణకు కాంగ్రెసే విలన్

- గోల్‌మాల్ చేయడంలో.. అబద్ధాల్లో దాన్ని మించింది లేదు
- కమీషన్లు తీసుకోవడం.. సంచులు మోయడమే ఆ పార్టీ పని
- 420 హామీల అమలులో వైఫల్యం
- ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే వారి వీపులు సాపు చేస్తారు
- పోలీసులూ.. వచ్చేది మా ప్రభుత్వమే.. తప్పుడు కేసులు వద్దు..
- నేను బయటికొస్తా.. పోరాడతా
- 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వని భాజపా
- ఆపరేషన్ కగార్‌ను కేంద్రం నిలిపివేయాలి
- భారాస రజతోత్సవ సభలో కేసీఆర్

2లో

## ఆంధ్రులు గర్వించేలా అమరావతి

- నిన్నటి విధ్వంసం నుంచి.. రేపటి వికాసం వైపు ప్రయాణం
- కుట్రలతో మన స్వప్నాన్ని దెబ్బతీయలేరని చెప్పేందుకే..
- రాజధానిని దేశమంతా గుర్తించేలా.. మోదీ చేతుల మీదుగా పనుల పునః ప్రారంభం
- ప్రధాని సభ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**సమయం న్యూస్, అమరావతి:** అమరావతి: నిన్నటి విధ్వంసం నుంచి..రేపటి వికాసం వైపు అమరావతి ప్రయాణం మొదలవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పునః ప్రారంభమయ్యే రోజు..రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు తరువాయి 2లో

## అంతర్గత మార్కులు లేవు.. సిలబస్ మార్పు లేదు

- ఇంటర్ బోర్డు ప్రతిపాదనలకు విద్యాశాఖ బ్రేక్

2లో



# తెలంగాణకు కాంగ్రెసే విలన్

వరంగల్: తెలంగాణకు ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని భారత రాష్ట్ర సమితి (భారాస) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణను 1956లో బలవంతంగా ఆంధ్రాతో కలిపింది, 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చిందీ కాంగ్రెస్సేనని విమర్శించారు. గోల్‌మాల్ చేయడంలో అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ నాయకుల్ని మించిన వారు లేరని దుయ్యబట్టారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే అది నిండా మోసం చేసిందని విమర్శించారు. భారాస రజతోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగసభలో కేసీఆర్ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి సంతాపసూచకంగా..సభ ఆరంభంలో ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్లలో తెలంగాణను ధగధగలాడించామని.. అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ వైఫల్యాల వల్ల 2014 కంటే ముందురోజులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై తాను కూడా ఊరుకోనని.. పోరాటాలకు బయల్దేరతానని తెలిపారు. భాజపా వైఖరి అంతా భభ్రాజమానం.. భజగోవిందం, శుష్కప్రియాలు, శూన్యహస్తాలుగా ఉందని, కేంద్రంలో ఉన్న ఆ పార్టీ తెలంగాణకు 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వలేదని, రాష్ట్రంపై మోదీ ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారని ఆరోపించారు.



**జననీ జన్మభూమిశ్చ స్ఫూర్తితో...**

''రామరావణ యుద్ధం పూర్తయ్యాక.. 'లంక చాలా సువర్ణమయంగా ఉంది.. ఇక మనం అయోధ్యకు వెళ్లడమెందుకు? ఇక్కడి నుంచే పరిపాలన చేద్దాం' అని లక్ష్మణుడు, ఇతర యోధులు అంటే.. శ్రీరామచంద్రుడు ఒప్పుకోలేదు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని హితవు పలికారు. కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ ఉండదని దాని అర్థం. మనకు ఆయన సూక్తులే స్ఫూర్తి. ఒకనాడు అత్యంత గందరగోళ పరిస్థితుల్లో.. ఆత్మహత్యలకు, వలసలకు నిలయంగా, వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న తెలంగాణను ఎట్టి పరిస్థితుల్లోనూ విముక్తి చేయాలని సంకల్పించాం. స్వరాష్ట్రం సాధించాలని, జనని, జన్మభూమిని మించింది లేదని చెప్పి నేను ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టా.

**ఆది నుంచీ కాంగ్రెస్ దగా..**

తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రం పేరుతో ఉన్ననాడు.. బలవంతంగా ఆంధ్రాతో కలిపిందే జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. 2001 నుంచి మరోసారి మనం ఉద్యమాన్ని ప్రారంభించి, విజృంభిస్తే.. మన బలాన్ని, ఊపును చూసి.. అదే కాంగ్రెస్ నంగనాచిలా వచ్చి.. పొత్తు పెట్టుకొని తెలంగాణ ఇస్తామని నమ్మబలికిన సంగతి మీకు తెలుసు. రాష్ట్రం ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తూ.. 14 సంవత్సరాలు ఏడిపించారు. వాళ్ల ఎత్తుగడలు, మోసాలకు దీటుగా నేను.. జయశంకర్ సార్ వ్యూహాలు రచిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాం. జాతీయస్థాయిలో విపక్షాలన్నిటినీ కూడగట్టాం. చివరకు పార్లమెంటులో అవన్నీ కలిసి మన తరఫున కాంగ్రెస్ గొంతు పట్టుకుంటే.. అప్పుడు ఆ పార్టీ దిగి వచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన విషయం మీకు తెలుసు. తర్వాత మరోసారి మడమ తిప్పి, ప్రకటన వెనక్కి తీసుకొన్నదీ మనకు తెలుసు. తర్వాత సకలజనుల సమ్మె, సాగరహారాలు, వంటావార్పులు.. ఇలా అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం. మూడేళ్ల తర్వాత రాజకీయ అవసరం ఏర్పడి.. తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. వారికి ఇష్టం లేకపోయినా తెలంగాణ సృష్టించిన సుడిగాలులను తట్టుకోలేకనే రాష్ట్రం ఇచ్చిన విషయం మీకు తెలుసు. ఉద్యమ సమయంలో ఆనాటి కాంగ్రెస్, తెదేపాల్లో ఉన్న నాయకులు పదవుల కోసం పెదవులు మూసుకున్నారు. ఏనాడూ గొంతెత్తి కొట్లాడలేదు. గులాబీ జెండా ఎగిరేవరకు కనీసం తెలంగాణ సోయిని కూడా ప్రదర్శించలేకపోయారు. స్వరాష్ట్రం కోసం అవసరమైన ప్రతి సందర్భంలోనూ పదవులు త్యాగం చేసినవారు భారాస బిడ్డలు మాత్రమేనని గర్వంగా చెబుతున్నా. కానీ, పదవుల కోసం తెలంగాణను ఆగం చేసినవారు ఆనాటి కాంగ్రెస్ నాయకులు. హైదరాబాద్ నడిబొడ్డున ఉండే మన శాసనసభలో ఒక దశలో తెలంగాణ పదాన్నే నిషేధించారు నాటి పాలకులు. తెలంగాణ అని అనవద్దంటూ స్పీకర్ ద్వారా రూలింగ్ ఇప్పించారు.

*** అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం**

ప్రత్యేక తెలంగాణలో ప్రజలు మనకు తొలి విడతలోనే పట్టం కట్టారు. అదేదో అధికారం అనుభవించేందుకు తీసుకోలేదు. బాధ్యతగా తీసుకున్నాం. రాష్ట్రాన్ని మన చేతుల్లో పెడితే ఎక్కడో ఉన్న తెలంగాణను ఎక్కడికో తీసుకెళ్లాం. పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ ఏ స్థాయికి ఎదిగింది.. ఎన్ని రంగాల్లో ఎన్ని అవార్డులు వచ్చాయి.. ఎన్ని అద్భుతమైన పనులు చేసి చూపించాం.. అన్నీ గుర్తుచేసుకోవాలి. తెలంగాణ అంటే ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. ఎగతాళికి గురైన ప్రాంతం. కానీ.. రాష్ట్రం ఏర్పడ్డాక వాటన్నిటినీ పటాపంచలు చేశాం. అన్ని రంగాలను పరుగు పెట్టించాం. రూ.90 వేలున్న తలసరి ఆదాయాన్ని రూ.3.50 లక్షలకు పెంచుకున్నాం. జీఎస్‌డీపీని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాం. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకున్నాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులను ఆగమేఘాలపై పూర్తి చేయించాం. పాలమూరు జిల్లాలోనే 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 3.5 లక్షల టన్నుల వడ్లు పండించే స్థాయికి రాష్ట్రంలో సాగునీటి సదుపాయాలను అభివృద్ధి చేశాం. పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి వరంగల్ గడ్డకు నీరు తెచ్చుకున్నాం. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నాం. వాగులు, వంకలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్లో పూడిక తొలగించాం. మొత్తంగా అద్భుతమైన తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం.

**ప్రజలు అడగకముందే..**

రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి కార్యక్రమాలు అమలు చేయాలని నన్నెవరూ అడగలేదు. మన రాష్ట్రం.. మన ప్రజలని.. వారిని బాగు చేసుకోవాలని ఆ పథకాలు అమలు చేశాం. చెరువుల్లో చేపలు పెంచాలని నన్ను ఎవరు అడిగారు? మత్స్యకారులకు పని దొరకాలని, వారిని ప్రోత్సహించాలని చెరువుల్లో చేపలు పెంచాం. లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని ఎవరూ అడగలేదు.. పెంపకందారులు బాగుండాలని ఆ పథకాన్ని అమలు చేశాం. పారిశ్రామికరంగంపై దృష్టి పెట్టాం. పెట్టుబడులను ఆకర్షించాం. సుమారు 2025 లక్షల మంది యువతకు ఉద్యోగాలిప్పించే ప్రయత్నం చేశాం. రూ. 40 వేల కోట్లున్న ఐటీ ఎగుమతులను రూ.2.50 లక్షల కోట్లకు పెంచగలిగాం. ఐటీ రంగంలో ఏడు లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. వెయ్యికిపైగా గురుకులాలు తీసుకువచ్చి.. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాం. మెడికల్ కాలేజీలను 3 నుంచి 33కి పెంచాం. భారాస హయాంలో మత కల్లోలం లేదు. కర్ఫ్యూ లేదు. శాంతిభద్రతల్ని చక్కగా కాపాడి.. అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నాం. ఇవన్నీ నా డైలాగులు కాదు, స్టోరీలు కాదు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా అనేక సందర్భాల్లో చెప్పిన విషయాలు.. ఆర్‌బీఐ, కాగ్ వంటి సంస్థలు వెల్లడించిన అధికారిక లెక్కలేనని మీకు మనవి చేస్తున్నాం.

*** సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు**

మన ప్రభుత్వంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు పెట్టి తడిసినా, రంగు పోయినా, మొలక వచ్చినా.. రైతులు, మన బిడ్డలు కాబట్టి ప్రభుత్వానికి రూ. 5 వేల కోట్ల నష్టం వచ్చినా కొన్నాం.. కాంగ్రెసోళ్లేమో ప్రజల్ని బోల్తా కొట్టించేందుకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన కల్యాణలక్ష్మిని కాదని.. దానికి తులం బంగారం కలిపి ఇస్తామన్నారు. ఇది ఎవరికైనా వచ్చిందా? ఇలా 420 హామీలపై పెద్ద పెద్ద పుస్తకాలు పంచారు. సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు. ఇవన్నీ ఎలా ఇస్తారని అడిగితే.. చేసి చూపిస్తామన్నారు. మరి అవన్నీ ఇచ్చారా? అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని చేయలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికలొచ్చాయి. నాకు కాలు విరిగినా, జనంలోకి బయలుదేరాను. దీంతో తెలంగాణలో ఎందరు దేవుళ్లుంటే అందరి మీదా ఒట్లు పెట్టారు. ఎన్నో మాటలు చెప్పి మోసం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి.. వాళ్లు జుట్లు పట్టుకుని కొట్టుకునే స్థాయికి తెచ్చారు. ఈ ఉచిత బస్సు మాకు అవసరం లేదని ఆడబిడ్డలు అంటున్నారు.

*** జేసీబీలతో పేదల ఇళ్లు కూలగొట్టిస్తున్నారు**

మేం జేసీబీలు పెట్టి చెరువుల్లో పూడిక తీస్తే.. కాంగ్రెస్ పార్టీ హైడ్రా అంటూ పేదల ఇళ్లు కూలగొట్టిస్తోంది. కేసీఆర్ బాగా ఇచ్చిన కరెంటు.. కాంగ్రెస్ ఎందుకివ్వలేకపోతోంది? మంచినీళ్లు ఎందుకు బంద్ అయ్యాయి? భూముల ధరలు ఎందుకు పడిపోయాయి? ప్రభుత్వ ఆదాయం కోసం అత్యవసరమైతే ప్రజలకు ఉపయోగం లేని భూములు అమ్మవచ్చు. కానీ ఏది అమ్మాలో.. ఏది అమ్మకూడదో తెలివి ఉండాలి. కాంగ్రెసోళ్లు ఇప్పుడు హెచ్‌సీయూ భూములను అమ్ముతున్నారు. రేపు ఓయూలో విలువైన భూములున్నాయని వాటిని అమ్మేస్తారా?

## 53% మంది అనర్హులే..!

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం 'ప్రజాపాలన'లో వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేయగా.. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులంతా దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని నిర్ధారించారు. అర్హులు, అనర్హుల వివరాలను గృహ నిర్మాణశాఖ ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జాబితాలుగా సిద్ధం చేసి పెట్టుకుంది. దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రంలో ఏటా గరిష్ఠంగా మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు అన్ని కోణాల్లో చేసిన సర్వేతో పాటు.. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తుదారులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3గా విభజించారు. ఎల్ 1లో 23.05 లక్షలు, ఎల్ 2లో 21.44 లక్షలు, ఎల్ 3లో 32.69 లక్షల దరఖాస్తుదారులు ఉన్నట్లు తేల్చారు. ఎల్ 1 జాబితాలో సొంత స్థలాలు ఉండి ఇళ్లు లేని వారిని చేర్చారు. సొంత స్థలంలో పూరిళ్లు, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. ఎల్ 2 జాబితాలో స్థలాలు, ఇళ్లు లేని వారిని చేర్చారు. ఎల్ 3 జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇళ్లు, కార్లున్నవారు, దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారు, ఆదాయపుపన్ను చెల్లిస్తున్న వారిని చేర్చారు. వీటి ఆధారంగా గత ఫిబ్రవరిలోనే జాబితాను తయారు చేశారు.

## ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ ఘాతుకానికి తెగబడిన ముష్కరులు, వారి వెనక ఉన్న కుట్రదారులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని ఉద్ఘాటించారు. పహల్గాం దాడికి సంబంధించిన ఫొటోలు చూస్తుంటే ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోందని పేర్కొన్నారు. 'మన్ కీ బాత్'లో ఆదివారం ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఉగ్రవాదంపై పోరాటంలో మన దేశ ఐక్యత, 140 కోట్ల మంది పౌరుల సంఘీభావమే అతిపెద్ద బలమని చెప్పారు. ''కశ్మీర్ లోయలో శాంతి నెలకొంటుండటం, అక్కడి పాఠశాలలు/కళాశాలల్లో చైతన్యం వెల్లివిరుస్తుండటం చూసి.. ఉగ్రవాద పోషకులు (పాకిస్థాన్‌ను ఉద్దేశించి) ఓర్వలేకపోయారు. కశ్మీర్‌లో మునుపెన్నడూ లేనంత వేగంగా నిర్మాణ పనులు జరుగుతుండటం, పర్యాటకులు రికార్డు స్థాయిలో పెరుగుతుండటం, ప్రజాస్వామ్యం బలోపేతమవుతుండటం, ప్రజల ఆదాయం పెరుగుతుండటం, యువతకు కొత్త అవకాశాలు వస్తుండటం చూసి వారు సహించలేకపోయారు. పహల్గాం దాడి.. వారి నైరాశ్యం, పిరికితనానికి అద్దం పట్టింది'' అని ప్రధాని పేర్కొన్నారు.

**మనకు యావత్ ప్రపంచ మద్దతుంది**

కశ్మీర్ అభివృద్ధి చెందుతుండటం మన దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ విరోధులకు నచ్చలేదని మోదీ అన్నారు. లోయ మళ్లీ నాశనమవ్వాలని ఉగ్రవాదులు, ఉగ్రచర్యల సూత్రధారులు కోరుకుంటున్నారని.. అందుకే ఇంత పెద్ద కుట్రకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పహల్గాం దాడి తనను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఈ ఉగ్రదాడి బాధితుల కుటుంబాల పట్ల.. భాష, రాష్ట్రం అనే భేదాల్లేకుండా భారతీయులంతా సానుభూతి చూపుతున్నారని చెప్పారు. ''నేను మరొక్కసారి హామీ ఇస్తున్నా. బాధిత కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుంది'' అని పేర్కొన్నారు.

## అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

హైదరాబాద్: భారాస అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు ఏ ఒక్క విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రులు విమర్శించారు. అధికారంపై కేసీఆర్ పగటికలలు కంటున్నారని.. ఈ మూడున్నరేళ్లతోపాటు మరో పదేళ్లూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కడుపులో అంతా విషం పెట్టుకుని ఎల్కతుర్తి బహిరంగసభలో కాంగ్రెస్‌పై అసత్యప్రచారం చేశారని మండిపడ్డారు. భారాస రజతోత్సవ సభ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ని విలన్‌లా సంబోధించిన భారాస అధినేతపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేదా? అని వారు నిలదీశారు. తెలంగాణ సంపదను కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల పేరుతో కొల్లగొట్టారని ఆరోపించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

*** మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులెలా వచ్చాయి?: పొంగులేటి**

'కడుపులో అంత విషం పెట్టుకుని, ఉక్రోషంతో మీ పార్టీ సభలో మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో చేసిన ఘనకార్యాలు, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చిద్దామా? ప్రతి అంశంపై మాట్లాడుదాం. ఆరు రోజులైనా, ఎనిమిది రోజులైనా చర్చిద్దాం. తేదీ ఎప్పుడో కేసీఆర్ చెప్పాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాలు విసిరారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. కేంద్రం నివేదిక ఇచ్చింది. కాళేశ్వరం అవినీతిపై సభలో ఎందుకు మాట్లాడలేదు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? నాడు సోనియాగాంధీని దేవత అని పొగిడారు. మీ కుటుంబం అంతా సోనియాకు సాష్టాంగ నమస్కారం చేసిన విషయాన్ని మరిచిపోయారా? ప్రజలు రెండుసార్లు అధికారం ఇస్తే తెలంగాణ సంపదను కొల్లగొట్టారు. అందుకే ప్రజలు మీ పార్టీకి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో గుణపాఠం చెప్పారు. మీరు ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో ప్రభుత్వానికి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. ఐదారు పర్యాయాలు అసెంబ్లీ సమావేశాలు జరిగితే మీరు ప్రేక్షకుడి మాదిరి రెండురోజులే వచ్చి వెళ్లారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో.. ఇందిరమ్మ ప్రభుత్వంలో మంత్రులంతా సామాన్యులకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతుంటే తట్టుకోలేకపోతున్నారు. మీరు సీఎంగా ఉన్నప్పుడే కాంట్రాక్టర్లకు రూ.8082 వేల కోట్ల బకాయిలున్నాయి. సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందే భారాస ప్రభుత్వం. ఉద్యమ పార్టీ నుంచి మొదలై భారాసగా మారిన మీ పార్టీకి రూ.1500 కోట్లకుపైగా డబ్బు ఎలా వచ్చింది? ఏం వ్యాపారం చేశారని మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులు వచ్చాయి? అధికారంపై మీవి పగటి కలలే. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ ఖమ్మం సభకు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్సులే కాదు.. ఆటోలు, ద్విచక్రవాహనాలను రాకుండా చేశారు. భారాస సభకు మీరు ఎన్ని బస్సులు అడిగితే అన్నింటికి రేవంత్ ప్రభుత్వం అనుమతించింది. ప్రజాస్వామ్యం అంటే ఇది. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తా అన్నారు. చేయలేదు. మీరు ఎలాగు అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవి దళితుడికి ఇవ్వొచ్చు కదా? కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలని మీరెంత తాపత్రయపడ్డా ఫలితం ఉండదు. మీ పగటి కలల్ని తెలంగాణ ప్రజలు నెరవేరనీయరు.'' అని పొంగులేటి అన్నారు.

**పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకున్నారు: సీతక్క**

''అధికారం పోయిందన్న అక్కసును కేసీఆర్ వెళ్లగక్కారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో 59వేల ఉద్యోగాలు ఇస్తే.. భారాస అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల్ని వాడుకుని అణచివేస్తే ఆత్మహత్యలు చేసుకున్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై కచ్చితంగా కేసులు పెడతాం. అధికారంలో ఉన్నప్పుడు ఇంటింటికి తాగునీటి పేరిట రూ.వేల కోట్లు తినేశారు.. కానీ నీళ్లు ఇవ్వలేదు. భారాస హయాంలో 5వేల మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అంత దారుణంగా పోలీసు వ్యవస్థను ఎవరూ వాడుకోలేదు. అధికారం ఉంటే.. అసెంబ్లీకి వస్తారు లేకుంటే రాని మీరు నాయకులు కానేకారు. నియంతలు అధికారం పోయాక ప్రజల్లోకి వచ్చి మొసలికన్నీరు కారుస్తారు.. కేసీఆర్ ఇందుకు నిదర్శనం.

**ఇంకా గర్వం పోలేదు..: జూపల్లి కృష్ణారావు**

''కేసీఆర్‌కు అధికారం పోయినా గర్వం, నియంతృత్వ ధోరణి ఇంకా పోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్, డిజైనర్, కాంట్రాక్టరు ఆయనే. నీటిపారుదలశాఖ కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ నివాసంలో సోదాలు చేస్తేనే రూ.200కోట్ల ఆస్తుల లెక్కలు దొరికాయని అంటున్నారు. కేసీఆర్ కుటుంబంలో ఇంట్లో ఎంత ఉంటాయో? ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదు. తెలంగాణ ఇస్తే ఏపీలో నష్టం జరుగుతుందని తెలిసీ, రాజకీయకోణంలో ఆలోచన చేయకుండా సోనియాగాంధీ పెద్దమనసు చేసుకుని రాష్ట్రం ఇచ్చారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే రూ.64వేల కోట్ల అప్పు నుంచి రూ.8లక్షల కోట్ల అప్పుచేశారు. 20 ఏళ్ల క్రితం ప్రైవేటు వ్యక్తికి 400ఎకరాల భూమి అప్పగిస్తే.. ఆ భూమి స్వాధీనం చేసుకునేందుకు పదేళ్లు కేసీఆర్ ఎందుకు ప్రయత్నించలేదు?

**సోనియా ఇవ్వకుంటే తెలంగాణ వచ్చేదా: పొన్నం**

సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని ఆనాడు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు పార్టీ సభలో అవకాశవాదిగా మాట్లాడారు. కాంగ్రెస్ విలన్ అన్న మాటలను ఆయన ఉపసంహరించుకోవాలి. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? కేసీఆర్ మూడు చెరువులు నీళ్లు తాగినా వంద మంది కేసీఆర్‌లు వచ్చినా కాంగ్రెస్ ఇవ్వకుంటే రాష్ట్రం ఏర్పడేది కాదు.

## పోరాటానికి మేం సై!

దిల్లీ: పాకిస్థాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించింది. తద్వారా దీర్ఘశ్రేణి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించేలా పోరాట సామర్థ్యాన్ని చాటింది. ''పోరాటానికి మేం సిద్ధం. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు సన్నద్ధంగా ఉన్నాం'' అని భారత నౌకాదళం ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా పరీక్షలకు సంబంధించిన వీడియోలనూ విడుదల చేసింది. అయితే వీటిని ఎప్పుడు నిర్వహించారన్నది వెల్లడించలేదు. ఇటీవల ఐఎన్‌ఎస్ సూరత్ యుద్ధనౌక నుంచి ఎంఆర్‌శామ్ క్షిపణిని భారత నౌకాదళం విజయవంతంగా పరీక్షించిన సంగతి తెలిసిందే.

## ఆంధ్రులు గర్వించేలా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందన్నారు. మే 2న రాజధానిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం సాయంత్రం సమీక్షించారు. 'ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని వైకాపా ప్రభుత్వం విధ్వంసం చేసింది. నేడు మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించి.. ఒక అద్భుత రాజధానిని నిర్మించి, విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతున్నాం' అని స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు దాడులు చేసింది. అయితే అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల అభిలాషకు అనుగుణంగా ప్రారంభమైన అమరావతి.. వాటన్నింటినీ తట్టుకుని నిలబడింది. గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా ఎదురైన సవాళ్లను.. కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే పరిష్కరించి.. నిలిచిపోయిన పనుల్ని పట్టాలెక్కిస్తున్నాం' అని సీఎం వివరించారు.

## అంతర్గత మార్కులు లేవు... సిలబస్ మార్పూ లేదు

హైదరాబాద్: ఇంటర్‌లో సిలబస్ మార్చాలని...అంతర్గత మార్కులు ప్రవేశపెట్టాలని ఎన్నో నెలలుగా ఇంటర్ బోర్డు చేసిన కసరత్తుకు బ్రేక్ పడింది. బోర్డు ప్రతిపాదనలకు విద్యాశాఖ ఆమోదం లభించలేదు. ఆర్ట్స్ గ్రూపు సబ్జెక్టులతోపాటు భాషా సబ్జెక్టుల్లో అంతర్గత మార్కులు ప్రవేశపెట్టాలని, వంద మార్కుల్లో ప్రాజెక్టులు/ఎసైన్‌మెంట్ తదితర వాటి పేరిట 20 ఇంటర్నల్ మార్కులు కేటాయించాలని, 80 మార్కులకు రాత పరీక్ష జరపాలన్నది బోర్డు ప్రతిపాదన. దానికితోడు సైన్స్ సబ్జెక్టుల్లో ఎన్సీఈఆర్టీకి అనుగుణంగా సిలబస్ తగ్గించడంతోపాటు చిన్న చిన్న మార్పులు చేయాలని భావించింది. సిలబస్ మార్పునకు అంగీకరించకపోవడంతో బోర్డు వర్గాలతోపాటు అధ్యాపకులు షాక్‌కు గురయ్యారు.

**గత నవంబరు నుంచి కసరత్తు :** వాస్తవానికి సిలబస్ మార్పునకు సంబంధించి గత ఏడాది నవంబరు నుంచి కసరత్తు జరుగుతోంది. అధ్యాపకులు, వర్సిటీల ఆచార్యులను ఆహ్వానించి సిలబస్ రివిజన్‌పై పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో పోల్చుకుంటే ఇంటర్‌లో అధికంగా ఉందని, విద్యార్థులకు భారంగా మారిందన్నది సబ్జెక్టు నిపుణుల అభిప్రాయం. రసాయనశాస్త్రంలో ఆరు అధ్యాయాలను ఎన్సీఈఆర్టీ తొలగించినందున ఇక్కడా తీసివేయాలన్నది ఇంటర్‌బోర్డు భావన. అలాగే గణితం, భౌతికశాస్త్రంలో 1520 శాతం సిలబస్ భారం తగ్గుతుందని బోర్డు వర్గాలు చెబుతూ వచ్చాయి. భౌతికశాస్త్రంలో సిలబస్ తగ్గుతున్నందున ఆ మేరకు కృత్రిమ మేధ, రోబోటిక్స్ లాంటి అంశాలపై అవగాహన కల్పించేలా సిలబస్‌లో చేర్చాలనుకున్నారు.

# తెలంగాణ రాష్ట్ర సంక్షేమం,అభివృద్ధికై బిఆర్ఎస్ పార్టీయే రక్ష

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర సంక్షేమం,అభివృద్ధికై బిఆర్ఎస్ పార్టీయే రక్ష అని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఛలో వరంగల్" రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని మాదిగ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామం ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ పార్టీ జెండాను




ఆయన పాల్గొని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా 2001 సంవత్సరంలో తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఆధ్వర్యంలో స్థాపించబడిన బిఆర్ఎస్ పార్టీ ఆ తర్వాత ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోందన్నారు. త్యాగాల నడుమ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చిన మహానేత కేసీఆర్ అని అన్నారు. అనంతరం చలో వరంగల్ రజతోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులకై ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, మాదిగ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. బలరాం, సభ్యులు జి.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.గోపాల్, ఎ.శ్రీనివాస్, శ్రీకాంత్, ఎ.యాదగిరి, జి.యాదగిరి, పోహన్న, అంజి, ఉమేష్ యాదవ్, మహా నగర్ ఈస్ట్ ప్రెసిడెంట్ ఎన్.కుమార్, బోలా శంకర్ నగర్ సభ్యులు సి.నారాయణ, నాగరాజు, మధు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ది మల్లేశం, మురళీ గౌడ్, నరహరి గౌడ్, నాగేష్, లక్ష్మణా చారి, ప్రభాకర్, బిక్షపతి గౌడ్, గోపాల కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, నాయకులు సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను తరలివెళ్ళిన బీఆర్ఎస్ శ్రేణులు






కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వరంగల్ లోని ఎల్కతుర్తి లో నిర్వహిస్తున్న "ఛలో వరంగల్" భారీ బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వరంగల్ రజతోత్సవ వేడుకలకు బయలుదేరి వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం "ఛలో వరంగల్"రజతోత్సవ వేడుకలు జయప్రదం కావాలని కోరుతూ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

## గ్రామ గ్రామాన జెండా ఎగురవేసి ఘనంగా టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి నాయకత్వంలో జరిగాయి. అన్ని గ్రామాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ లో జరిగే సభకు ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామాలలో ప్రదర్శన నిర్వహించారు.

## మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ




మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడి మానవత్వానికి పెద్ద దెబ్బగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. ఈ దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినందుకు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని, మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బీబ్లాక్ మల్కాజ్‌గిరి సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మౌలాలి చౌరస్తా వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ క్యాండిల్ ర్యాలీలో స్థానిక నాయకులు వినోద్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను, అలాగే రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, ఈ కష్ట సమయంలో దేశం మొత్తం ఐక్యతగా, సోదరభావంతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తూ "హిందూ ముస్లిం భాయి... భాయి..." అనే నినాదాలతో ఈ ర్యాలీ సాగింది. మతభేదాలను మరిచి, మానవత్వాన్ని కాపాడుకోవాలని, దేశ భద్రత, శాంతి కోసం అందరూ కలిసి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్యాండిల్ ర్యాలీలో భారీ సంఖ్యలో హిందూ, ముస్లింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.




## కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి ప్రాబల్యంలోకి తేవడం మనందరి బాధ్యత

*** వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**



**శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి)** : రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వాన్ని మళ్లీ ప్రాబల్యంలోకి తేవడం మనందరి బాధ్యత అని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ సభ సందర్భంగా ఆదివారం మాధవరం నగర్ కాలనీలో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం డప్పుల వాయిద్యాలతో, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వందలాది మందితో సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవ స్థాపకుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్ 14 ఏళ్ల పోరాటంతో తెలంగాణ సాధించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో అభివృద్ధి కాంతి చూపలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్నదని విమర్శించారు. అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ నుంచి వందలాదిగా కార్యకర్తలు, ప్రజలు సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, టీఆర్ఎస్ పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళా నాయకులు, విద్యార్థి విభాగం నేతలు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రైతులు నష్టపోకుండా.. ప్రభుత్వం ఆదుకుంటుంది

**- వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలన**

**- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు నష్టపోకుండా.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం కురిసిన అకాల వర్షానికి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సందర్శించారు. తడిసిన ధాన్యపు రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతున్నాయని తహసీల్దార్ హరికృష్ణ, మార్కెట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. మొదట పట్టా వేసి, పట్టా పైన ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. అకాల వర్షాలు వచ్చినప్పుడు ఆరబెట్టిన ధాన్యంపై పట్టా కప్పాలని, తద్వారా ధాన్యం తడవదని రైతులకు సూచించారు. రోజు రోజుకు



చౌటుప్పల్ మార్కెట్ పరిధిలో ధాన్యం పంట బాగా పెరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా మార్కెట్ యార్డ్‌ను విస్తరించవలసిన అవసరం ఉందన్నారు. త్వరలోనే అధికారులతో చర్చించి తగు ఏర్పాట్లు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, డైరెక్టర్లు గౌస్ ఖాన్, సప్పిడి సంజీవ రెడ్డి, పబ్బు శ్రీకాంత్, రాజి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ మండల అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, చింతల సాయిలు మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూసుకుంట్ల నాయకత్వంలో వరంగల్ సభకు తరలిన టీఆర్ఎస్ శ్రేణులు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ జెండాను మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు బయలుదేరే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయాలను ప్రజలకు వివరించడం, భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి ప్రణాళికలు, కార్యాచరణను ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయడమే ఈ సభ ఉద్దేశమన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల్లో వరంగల్‌కు పయనమయ్యారు.

## చలో వరంగల్ కు తరలివెళ్ళిన బీఆర్ఎస్ నేతలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ నుండి బయలుదేరుతున్న నాయకులకు, కార్యకర్తలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వాటర్ బాటిల్స్ అందచేసిన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి ఈ కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకులు, ఉద్యమకారులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీ 25వ జెండా ఆవిష్కరణ




ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని రౌండ్ బిల్డింగ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ 25వ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. డివిజన్ ప్రజల ఉత్సాహం మధ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని జెండా ఆవిష్కరణను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కురెళ్ల గ్రామానికి చెందిన సుమారు 50 మంది టీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఈ రోజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీర్ల ఐలయ్య గారు,"కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితులై నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం ప్రజలు ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. కురెళ్ల గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఆత్మకూరు మండలంలో కురెళ్లను నెంబర్ వన్ గ్రామంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నాను," అని తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : దూడల బిక్షం గౌడ్

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఉదయం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, మండల అధ్యక్షుడు కైరం కొండ అశోక్ ల ఆధ్వర్యంలో సందర్శించారు. తడిసిన ధాన్యపు రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎన్ని రోజుల నుంచి ధాన్యం ఆరబోశారు, ధాన్యపురాసులపై కప్పడానికి పట్టాలు ఇచ్చారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దూడల భిక్షంగాడు మాట్లాడుతూ రైతులందరికీ సరిపడా పట్టాలు లేవని, ధాన్యంపు రాశులకు సరిపడా పట్టాలను అందించాలని





డిమాండ్ చేశారు. రైతులు ధాన్యం ఆరబెట్టి 15రోజులు గడుస్తున్నా, మ్యాచర్ వేసి కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేశం యాదవ్, ఊడుగు వెంకటేశం గౌడ్, ఉబ్బు బిక్షపతి, కట్ట కృష్ణ, కడారి ఐలయ్య, దిండు భాస్కర్, వనం ధనంజయ, రాధారపు సత్తయ్య, కడవేరు పాండు తదితరులు పాల్గొన్నారు.

## మారుతి మిత్ర మండలి అమావాస్య అన్నదానం..



ప్రజాస్ఫూర్తి, కాప్రా :అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదని, అన్నదానం అంటే, పేదలకు, అవసరమైన వారికి ఆహారం అందించడం. ఇది చాలా గొప్ప దానం అని నమ్ముతారని కుషాయిగూడ శివాంజనేయ దేవస్థానం అధ్యక్షుడు గట్టమనేని సుబ్బారావు అన్నారు. ఆదివారం చైత్ర అమావాస్య సందర్భంగా మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించే అమావాస్య అన్నదాన కార్యక్రమానికి ఆయన గుంటి ఆంజనేయులు యాదవ్, అల్లాదుర్గం సతీష్‌లతో కలిసి అతిధిగా హాజరయ్యారు. ముందుగా పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతీ మిత్రమండలి బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్రమండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరుగంటి హనుమంతు, కోశాధికారి మచ్చబాబు గౌడ్, గోపాల్ రెడ్డి, గోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఈ సి ఐ ఎల్ ఎక్స్ రోడ్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా: వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈ సి ఐ ఎల్ ఎక్స్ రోడ్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణ ముఖ్య అతిధి గా కాల్వ సుజాత గుప్త తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్పర్సన్ విచ్చేసినారు అనంతరం కుషాయిగూడ కు చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మ కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి , పడకంటి కమలమ్మ లకు ఈనెల పించిని నలుగురికి వెయ్యి రూపాయలు చొప్పున నల్గురికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూర్ అశోక్ గుప్తా, చెన్న చక్రపాణి గుప్త,తాటి శ్రీనివాస్ గుప్త , కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్తా, చందా సంతోష్ గుప్తా ,బల్లి శ్రీధర్ గుప్త ,కార్యవర్గ సభ్యులు మిరియాల అరుణ్ కుమార్ గుప్తా, ఉప్పల ఆంజనేయులు గుప్తా ,రాయికంటి వేణు గుప్త ,సభ్యులు రాయల శ్రవణ్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, కండె శివ గుప్త, దిడిగం కైలాసం గుప్త, గట్టు బాలకృష్ణ గుప్త, బెలిదే బాగువాన్ గుప్త, ఎనిశెట్టి సుదర్శన్ గుప్తా, కొకలా కృష్ణ మూర్తి గుప్త ,కూర శ్రీనివాస్ గుప్త ,రవ్వ ఈశ్వర్ గుప్త ,పెద్ది నవీన్ గుప్త, తాలపల్లి శివ గుప్త ,మొట్కూరి సతీష్ గుప్త , అమిర సాయి కుమార్ గుప్త, అనుములు నర్సింగ్ గుప్త, తోటంశెట్టి రాంలింగం గుప్త, తదితరులు పాల్గొన్నారు

## ఉగ్రవాద దాడికి నిరసనగా దమ్మపేటలో పాత్రికేయుల ర్యాలీ




దమ్మపేట, ప్రజాస్ఫూర్తి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలో ఇటీవల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో యాత్రికులపై ఉగ్రదాడికి నిరసనగా పాత్రికేయుల ఆధ్వర్యంలో జయలక్ష్మి థియేటర్ నుంచి సెంట్ మేరీస్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని ఉగ్రవాదులు చేసిన చర్యను తీవ్రంగా ఖండించారు.జై భారత్ పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఉగ్రదాడి కారణమైన ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట, ప్రజా ప్రెస్ క్లబ్ ఛైర్మన్, ఎస్.కె దస్తగిరి మాట్లాడుతూ ఉగ్రవాదులు జరిపిన దాడి అత్యంత హేయమైనదని పర్యాటకులపై ఉగ్రవాదుల అమానుష దాడి పాశవిక ఘటన అన్నారు. ఇస్లాం శాంతిని బోధిస్తుంది అంతేగాని ఉగ్రవాదాన్ని అసలు ప్రోత్సహించదు.ఒక మనిషిని చంపే అధికారం ఎవరికి లేదంటూ ఇలా ఉగ్రవాదానికి పాల్పడే ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

## ఘనంగా జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పిల్లల సదస్సు



గచ్చిబౌలి , (ప్రజాస్ఫూర్తి) : జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణ సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు.జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడి రిషికేశ్ రెడ్డి అధ్యక్షతన, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ , ప్రోగ్రాం కన్వీనర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షులు జి. వి హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జవహర్ బాల్ మంచ్ జాతీయ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఫెన్ రస్సెల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సు లో మొట్టమొదటి జవహర్ బాల్ మంచ్ తెలంగాణ, పిల్లల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి వారి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షులు గా సంతోష్, వైస్ ప్రెసిడెంట్ పునీత్, అంబటి సుచరిత ను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు ఆశయాలు స్ఫూర్తిని, పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ మరియు స్కిల్ డెవలప్ మెంట్ తదితర అంశాల మీద పిల్లలకు అవగాహన కోసం ఒక రోజంతా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జవహర్ బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్తలాగా పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షులు రిషికేశ్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నుండి తితిలి యూనిట్ లోని పిల్లలు 200 మంది పైగా పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్ బాబు,కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయి కృష్ణ, బాల్య నాయక్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్లు సైదేశ్వర రావు, సుదర్శన్, సునీల్, విదుర్ చావ్లా, కోదరి వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ తృతీయ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా మలబార్ గోల్డ్ , డైమండ్స్ తమ కస్టమర్ల కోసం ప్రత్యేక అఫర్లను ప్రకటించింది.ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాల తరుగు చార్జీల పై 25% వరకు తగ్గింపు, ప్రీషియస్ స్టోన్స్ , అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు చార్జీల పై ఫ్లాట్ 25% తగ్గింపు , వజ్రాల విలువపై 25% వరకు తగ్గింపు అందిస్తోందన్నారు. ఎంతో విలువైన వృత్తి నైపుణ్యం మేళవించిన ఆభరణాలలో వినియోగదారులు పెట్టుబడి పెట్టడానికి, ఈ పండుగ ఆఫర్లు అసాధారణమైన అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. ఈ పండుగ కొనుగోలు అనుభూతిని మరింత లాభదాయకంగా మార్చడానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతో ఉచితంగా వెండి నాణెం అందిస్తోందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వినియోగదారులు తాము కొనుగోలు చేయాలనుకునే ఆభరణాల మొత్తం విలువలో కనీసం 10% చెల్లించి తమ ఆభరణాలను బుక్ చేసుకోవచ్చన్నారు. బంగారం ధరల పెరుగుదల నుండి రక్షణ పొందవచ్చు. బుక్ చేసిన రోజు మార్కెట్ ధర లేదా ఆభరణాలు తీసుకునే రోజు మార్కెట్ ధర ఈ రెండింటిలో ఏది తక్కువైతే దానినే తుది ధరగా నిర్ణయిస్తారని, తద్వారా కస్టమర్లకు సాధ్యమైనంత ఉత్తమ విలువ అందించబడుతుందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'డివైన్' అనే ప్రత్యేకమైన బ్రాండ్ కింద 'తన్విక' అనే కొత్త ఆభరణాల సేకరణను ఆవిష్కరించిందన్నారు. దైవత్వం నుండి ప్రేరణ పొంది, నిష్కళంకమైన హస్తకళ ద్వారా జీవం పోసుకున్న ఈ ఆభరణాలు సేకరణలు అద్భుతమైన కొత్త డిజైన్లను అందిస్తున్నాయన్నారు. ప్రతి ఆభరణం కాలాతీత సంప్రదాయాలు , ఈ పండుగ కాలం యొక్క సమృద్ధిని ప్రతిబింబిస్తుందన్నారు. మా విలువైన కస్టమర్లతో శాశ్వత సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ఈ ప్రత్యేకమైన ఆఫర్లు ఒక మార్గం" అన్నారు.

## పహల్గాం యాత్రికులపై ఉగ్రవాద దాడి అమానుషం

* ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య




ప్రజాస్ఫూర్తి, కాప్రా : జమ్ము కాశ్మీర్ పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదముష్కర్ల దాడి రాక్షస చర్య అని ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గాంలో యాత్రికులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల రాక్షస చర్యను నిరసిస్తూ మృతులకు నివాళి అర్పిస్తూ ఆదివారం ఉదయం ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు నూట యాభై మంది పైనే సభ్యులు ఈసీఐఎల్ గ్రౌండ్ నుంచి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ మీదుగా ఈసీఐఎల్ బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని మృతులకు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత కాప్రా సర్కిల్ కార్యాలయంకు చేరుకొని ఉగ్రవాదంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపాలంటూ జాతిపిత మహాత్మా గాంధీకి వినతిపత్రం సమర్పించారు. సమతా ర్యాలీ సాగిన దారి పొడవున పెద్దలు మహిళలు ముఖ్యంగా చిన్నారులు ఒక చేత్తో జాతీయ జెండా మరో చేత్తో ప్లకార్డులను చేత పట్టుకొని వత్తుకున్నాం కంటిలో తడిని ఎత్తుకుంటాం భారత్ జెండాను, కరో కరో సంఘర్ష్ కరో హమ్ తుమారా సాథ్, ఉగ్రవాదం నశించాలి, భారత్ మాతాకీ జై అంటూ దిక్కులు పిక్కటిల్లేల నినదించారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు, ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ సభ్యులు చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

## ఈసినగర్ సమగ్ర అభివృద్ధికి చర్యలు

* సొసైటి అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్
* కమిటీహాల్ లో ఈసినగర్ సోసైటీ సర్వసభ్య సమావేశం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఈసినగర్ సోసైటిలో సమస్యలు తలెత్తకుండ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమని ఈసినగర్ హౌజ్ బిల్డింగ్ సోసైటి కమిటి అధ్యక్షుడు బుడిద శ్రావన్కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఈసినగర్ కమ్యూనీటి హాల్లో అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన కాలనీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఈసినగర్ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, చేపట్టిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈసినగర్ సోసైటిలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిక్షరిస్తామని తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరం జామ ఖర్చులు వివరాలు కోషాధికారి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా పలు విధానపరమైన నిర్ణయాలను సమావేశంలో వెల్లాడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సిహెచ్ పర్మిని, ప్రధాన కార్యాదర్శి ఎం.జగ్గారాజు, కోషాధికారి శ్రీమతి కాసుల ఇందిరగౌడ్, కమిటి సభ్యులు బిక్షపతి, బాలయ్యగౌడ్, ఎమ్ మల్లేష్, బాల్రెడ్డి, భానుకుమార్, సత్తిరెడ్డి, జౌండ్ల ప్రభాకర్ రెడ్డి, క్రిష్ణరెడ్డి, జేసిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు తరలివెళ్ళిన బీఆర్ఎస్ శ్రేణులు






జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ జాతిపిత కేసీఆర్ 14 ఏళ్ల పోరాటంతో తెలంగాణ సాధించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బీఆర్ఎస్ జెండాలను కార్పొరేటర్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ లో జరిగే బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, యూత్ నాయకులు కొలుకుల జైహింద్, వేణుయాదవ్, మనోజ్, మల్లేష్ గౌడ్, విఠల్, ఇందిరాగౌడ్, ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో...

వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు రంగారెడ్డినగర్ డివిజన్ లోని పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయా ప్రాంతాలలో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, సుధాకర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రెషర్ కుక్కర్.. దీని సహాయంతో వివిధ వంటకాలను సులభంగా వండేయచ్చు. అయితే కొన్ని రకాల వంటకాలను ప్రెషర్ కుక్కర్‌లో వండడం వల్ల అవి రుచి కోల్పోవడమే కాకుండా.. పలు ఆరోగ్య సమస్యలూ వస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందామా...







# ప్రెషర్ కుక్కర్‌లో.. ఇవి వండద్దట!

**ఇవి వద్దు!**

ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లు వచ్చినా.. ఇప్పటికీ కొంతమంది ప్రెషర్ కుక్కర్‌లో అన్నం వండుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే బియ్యంలో స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. ప్రెషర్ కుక్కర్‌లో అన్నం వండినప్పుడు ఈ స్టార్చ్ హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. దానివల్ల పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే ప్రెషర్ కుక్కర్‌కు బదులు సాధారణ గిన్నెలోనే అన్నం వండుకోవడం మేలంటున్నారు. అన్నంతో పాటు స్టార్చ్ ఎక్కువగా ఉన్న బంగాళాదుంపలు, పాస్తా, నూడుల్స్.. వంటివీ ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదట!

**పాలు-పెరుగు**

కొన్ని కూరల్లో గ్రేవీ కోసం పాలు, పెరుగు పోసి వండడం మనకు అలవాటే! అయితే ఇలాంటి వంటకాల్ని కూడా ప్రెషర్ కుక్కర్‌లో వండడం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే కుక్కర్‌లోని అధిక వేడి, ఒత్తిడికి పాలు విరిగిపోయే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. కూర రుచి కూడా దెబ్బతింటుంది. ఇలాంటివి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం!

**త్వరగా ఉడికేవి!**


త్వరగా ఉడకని పప్పులు, మటన్.. వంటి పదార్థాల కోసమే ఎక్కువమంది ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. కానీ కొంతమంది ఆకుకూరలు, వంకాయ, బ్రకలీ, క్యాలీఫ్లవర్.. వంటి త్వరగా ఉడికే వాటికీ ప్రెషర్ కుక్కర్ వాడుతుంటారు. అయితే దీనివల్ల అందులో ఉత్పత్తయ్యే అధిక వేడి కారణంగా ఆయా కాయగూరలు, ఆకుకూరల్లోని పోషకాలు నశిస్తాయి. అలాగే అవి వాటి సాధారణ రంగు, రుచిని కూడా కోల్పోతాయి. కాబట్టి ఇదీ ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు.

**బేకింగ్ కోసం..!**

అవెన్ లేని వారు కేక్స్, కుకీస్.. వంటి బేకింగ్ ఉత్పత్తులు తయారుచేయడానికి ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. దీనివల్ల అవి అంత మృదువుగా రాకపోగా.. వాటి టెక్స్చర్, రుచి దెబ్బతింటాయి.

# నిగనిగలాడే కురుల కోసం..!

**నిగనిగలాడే నల్లటి వాలు కురులు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ఈ రోజుల్లో ఆహారపు అలవాట్లతో పాటు మారుతోన్న జీవనశైలి ప్రభావం కురులపై కూడా పడుతోంది. వీటికి తోడు స్టైలింగ్ కోసం ఉపయోగించే ఉత్పత్తులు కేశాలను నిర్జీవంగా మార్చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే సులభంగా చేసుకునే హెయిర్‌ప్యాక్‌ను ప్రయత్నించి చూడండి.**





**కావాల్సినవి:**

* కోడిగుడ్డు సొన
* తేనె- ఒక చెంచా
* ఆలివ్ ఆయిల్ - ఒక చెంచా
* ఆముదం నూనె - ఒక చెంచా
* ఆర్గన్ ఆయిల్- ఒక చెంచా

**తయారీ:**

* ముందు కోడిగుడ్డు సొన ఒక పాత్రలో వేసుకుని బాగా కలపాలి. తర్వాత తేనె, ఆలివ్ ఆయిల్, ఆముదం నూనె, ఆర్గన్ ఆయిల్ కూడా వేసి బాగా కలపాలి.
* ఈ మిశ్రమాన్ని తలకి పట్టించి అరగంట పాటు ఆరనివ్వాలి. తర్వాత మంచి షాంపూ, కండిషనర్‌తో జుట్టుని శుభ్రపరుచుకుంటే సరి.. నిగనిగలాడే కురులు సొంతమవుతాయి.

# ముడతలూ, మచ్చలూ అందుకేనా?




**30వ పడిలోకి అడుగుపెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలైపోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్య నుంచి బయటపడటానికి ఏవేవో మార్గాల్ని అనుసరిస్తుంటారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెలా వాడాలంటే...**

* చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది.
* ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకుని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది.
* చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజసిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయిలూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు.
* చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతోపాటూ మెడకూ దీన్ని రాయాలి.
* వీటి వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసుకోవాలి. అలాకాకుండా, ఎక్కువ,తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు.
* ఆయిలీ స్కిన్ కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే.
* చర్మం మీద ఉండే మృతకణాల్ని ఎప్పటికప్పుడూ తొలగిస్తూ ఉండాలి. ఇలా చేయకుండా మాయిశ్చరైజర్ రాసినా ఉపయోగం ఉండదు.

# 70 ఏళ్లలో తొలిసారి.. హనుమాన్‌గఢీని వీడి బాలరాముడి దర్శనానికి!

అయోధ్యలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. స్థానికంగా ప్రసిద్ధి చెందిన హనుమాన్‌గఢీ ఆలయ ప్రధాన అర్చకుడు తొలిసారి ఆలయ ప్రాంగణాన్ని వీడి రామాలయానికి వెళ్లనున్నారు. ఏప్రిల్ 30న అక్షయ తృతీయ సందర్భంగా బాలరాముడిని దర్శించుకోనున్నారు. గతేడాది జనవరి 22న అయోధ్య బాలరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ జరిగిన విషయం తెలిసిందే. అయోధ్యలో దాదాపు 32 ఎకరాల్లో హనుమాన్‌గఢీ ఆలయం విస్తరించి ఉంది. శతాబ్దాలుగా వస్తున్న ఆచారాల ప్రకారం.. ఆలయ అధిపతి (గద్దీ నషీన్) జీవితాంతం ఆలయ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లకూడదు. 18వ శతాబ్దంలో ఆలయ స్థాపనతో మొదలైన ఈ సంప్రదాయం చాలా కఠినమైనదని, కోర్టుల ముందు కూడా హాజరయ్యే వీల్లేదని స్థానికులు ఓ వార్తాసంస్థకు తెలిపారు. ప్రస్తుతం ప్రధాన పూజారిగా ఉన్న 70 ఏళ్ల మహంత్ ప్రేమ్ దాస్.. ఎన్నడూ గుడి ప్రాంగణాన్ని వీడలేదు. ఇటీవల ఆయన రామాలయాన్ని సందర్శించాలనే కోరికను వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని నిర్వాణి అఖాడా దృష్టికి తీసుకెళ్లగా.. అక్కడి




సభ్యులు దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. "ఏప్రిల్ 30న అక్షయ తృతీయ రోజు ఆలయ అధిపతి ఊరేగింపుగా అయోధ్య రామాలయానికి వెళ్తారు. ఈ వేడుకలో ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు భాగమవుతాయి. ప్రధాన అర్చకుడి వెంట నాగ సాధువులు, వారి శిష్యులు, భక్తులు ఉంటారు. తొలుత ఉదయం 7 గంటలకు సరయూ నది తీరానికి చేరుకుని, అక్కడ పుణ్యస్నానాల అనంతరం రామాలయానికి వెళ్తారు" అని అఖాడా ప్రధాన మహంత్ రామ్‌కుమార్ దాస్ తెలిపారు.

## 2028లోనూ మాదే అధికారం
### : డీకే శివకుమార్



బెంగళూరు: భాజపా, జేడీ(ఎస్) లపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికార పీఠం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కానీ, వారి ప్రయత్నాలు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డీకే ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రజలు మాకు అందించిన ఆదరణను మరచిపోలేం. రాష్ట్రంలో పరిపాలన బాగుందని ప్రశంసలు వస్తున్నాయి. మా ప్రభుత్వం ఇటీవల రూ.4 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అందరికీ సమాన హక్కులు, జీవితం అనే ఉద్దేశంతో దీన్ని ప్రవేశపెట్టాం. అన్ని వర్గాల వారిని ఏకతాటి పైకి తీసుకొచ్చేందుకు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. గతంలో మహిళలు, యువత, రైతుల అభివృద్ధి కోసం భాజపా, జేడీ(ఎస్) ఏం చేశాయి" అని డీకే శివకుమార్ ప్రశ్నించారు. "ఏదో ఒకటి చేసి మా ప్రభుత్వాన్ని కూల్చేయాలని కుట్రలు చేస్తున్నారు. దాని గురించి ఇంకా కలలు కంటూనే ఉన్నారు. రెండు పార్టీలు ఒక కూటమి ఏర్పాటు చేసుకున్నాయి. మరో నాలుగు పార్టీలు చేరినా మాకు నష్టం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మీరు అనుకున్నది మాత్రం నెరవేరదు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది." అని ధీమా వ్యక్తం చేశారు.

## పాక్ చెరలో ఉన్న నా భర్త రాకపై సమాచారం లేదు..
### ఫిరోజ్‌పుర్ వెళ్తా: BSF జవాన్ భార్య



కోల్‌కతా: ఇటీవల పొరపాటున సరిహద్దు దాటి పాక్ సైన్యం చేతికి చిక్కిన బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం సాహూ పరిస్థితిపై అతడి కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తన భర్త పాకిస్థాన్ సైన్యం చేతికి చిక్కి ఐదు రోజులవుతున్నా.. తిరిగి ఎప్పుడొస్తారనే అంశంపై ఎలాంటి సమాచారం లేదని అతడి భార్య రజనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి తాను తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. గర్భిణిగా ఉన్న రజనీ.. తన భర్త రాకకు సంబంధించిన సమాచారం కోరేందుకు అతడు పనిచేసే పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌కు సోమవారం బయల్దేరనున్నట్లు వెల్లడించారు. "రేపు చండీగఢ్‌కు విమానం టికెట్ తీసుకున్నా. అక్కడి నుంచి ఫిరోజ్‌పుర్ వెళ్తా. నా కుమారుడు, ముగ్గురు బంధువులు నా వెంట వస్తారు" అని ఆమె వెల్లడించారు. అయితే, తొలుత ఆమె ఆదివారం సాయంత్రం బయల్దేరి వెళ్లేందుకు అమృత్‌సర్ మెయిల్‌కు టికెట్ బుక్ చేసుకోగా.. టికెట్ కన్ఫామ్ కాలేదు. దీంతో విమానంలో వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. తన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పకపోతే.. ఫిరోజ్‌పుర్ నుంచి నేరుగా దిల్లీకి వెళ్లి ప్రభుత్వ అధికారులతో మాట్లాడతానని రజనీ తెలిపారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన పూర్ణం సాహూ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు తిరిగి వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత సరిహద్దు భద్రతా దళానికి చెందిన జవాను పూర్ణం సాహూ ఇటీవల పొరపాటున సరిహద్దు దాటి పాక్ సైన్యానికి చిక్కిన సంగతి తెలిసిందే. అతడిని క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చేలా కేంద్రం చర్చలు జరుపుతోంది.



## పాక్ పౌరులు భారత్‌లోనే ఉంటే.. మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా!

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ కఠిన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆయా వీసాల కింద భారత్‌లో ఉన్న పాక్ పౌరులను నిర్ణీత గడువులోగా స్వదేశానికి వెళ్లిపోవాలని ఆదేశించింది. అయితే, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా గడువు దాటినా ఇక్కడే ఉంటే.. ఇటీవల తీసుకొచ్చిన చట్టం ప్రకారం వారిని అరెస్టు చేయొచ్చు. విచారణ చేపట్టి.. గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, లేదా రూ.3 లక్షల జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉంది. 'సార్క్' వీసాల కింద భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు ఏప్రిల్ 26లోపు దేశాన్ని వీడాలని కేంద్రం ఇటీవల ఆదేశించింది. వైద్య వీసాల కింద వచ్చినవారికి ఈ నెల 29వరకు గడువు ఇచ్చింది. బిజినెస్, విజిటర్, స్టూడెంట్ తదితర 12 విభాగాల్లో వీసాలు ఉన్నవారు ఏప్రిల్ 27 నాటికి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. ఏప్రిల్ 4 నుంచి అమల్లోకి వచ్చిన 'ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025' ప్రకారం..గడువు తీరిపోయినా ఇక్కడే ఉండటం, వీసా నిబంధనలు ఉల్లంఘించడం, నిషేధిత ప్రాంతాలను సందర్శించడం వంటి సందర్భాల్లో మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇప్పటికే అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి.. ఈ విషయమై దిశానిర్దేశం చేశారు. దీంతో ఆయా రాష్ట్రాలు పాక్ పౌరులను గుర్తించి, వెళ్లిపోవాలని సూచించాయి. ఈ క్రమంలోనే అనేక మంది పాకిస్థాన్ జాతీయులు అటారీ వాఘా సరిహద్దు గుండా తిరుగుబాట పట్టారు. మూడు రోజుల్లో 509 మంది ఈ సరిహద్దు గుండా దేశం దాటారు. మరోవైపు.. ఆ దేశంలో ఉన్న 745 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు.

## ఉగ్రవాదులను పోషించడం..
## మాట మార్చడం పాక్‌కు అలవాటే: శశి థరూర్



తిరువనంతపురం: పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ అన్నారు. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేతపై పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలపై థరూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో శతాబ్దాలుగా పాకిస్థాన్ సరిహద్దుల్లో శిక్షణనిస్తున్నప్పటికీ..భారత్‌లో జరిగే ఉగ్రవాద దాడులకు మాత్రం తమది బాధ్యత కాదంటూ తప్పుకుంటుందని విమర్శించారు. పాక్ ఉగ్రవాదులకు శిక్షణనిస్తుందనే విషయాన్ని విదేశీ నిఘా సంస్థలు ఆధారాలతో నిరూపించినప్పటికీ ఆ దేశం మాత్రం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంటుందని అన్నారు. 2016లోని ఉరి, 2019లోని పుల్వామా ఉగ్రదాడుల తర్వాత భారత్ ఏ విధంగా ప్రతీకారం తీర్చుకుందో అంతకంటే కఠినమైన ప్రతిస్పందనను ఉగ్రవాదులు, వారిని పోషిస్తున్న దేశం ఎదుర్కోవాల్సి వస్తుందని థరూర్ హెచ్చరించారు. తమ సోదరులను ఉగ్రవాదులు కిరాతకంగా హత్య చేసినందుకు దేశ ప్రజలు గట్టి ప్రతీకారాన్ని కోరుతున్నారని ఆయన అన్నారు. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ భుట్టో చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇవి కేవలం వారి ప్రగల్భాలు మాత్రమేనని కొట్టిపడేశారు. పాకిస్థాన్ జోలికి భారత్ ఎప్పుడూ స్వయంగా రాదని..కానీ ఇక్కడి ప్రజలకు నష్టం చేయాలని చూస్తే మాత్రం ఊరుకోదని అన్నారు. సింధూ నదిలో రక్తమే ప్రవహించాలనుకుంటే ఇక్కడి కంటే ఎక్కువ వారి దేశంలోనే ప్రవహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1960లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేసింది. దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్నారు. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

## పాకిస్థాన్‌తో యుద్ధం.. నేనలా అనలేదు: సీఎం



పహల్గాం ఉగ్రదాడిపై మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదంటూ చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య విమర్శలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ మీడియాలో ఈ వ్యాఖ్యలు ప్రసారం అవుతుండటంతో.. భాజపా శ్రేణులు ఆయన్ను తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఈ క్రమంలోనే సీఎం సిద్దరామయ్య ఈ విషయమై వివరణ ఇచ్చారు. యుద్ధం వద్దని తాను చెప్పలేదని.. అనివార్యమైతేనే జరగాలని, ఎందుకంటే అది పరిష్కార మార్గం కాదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడకుండా పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పాలని ట్వీట్ కూడా చేశారు. "పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదని చెప్పలేదు. సంబంధిత డిమాండ్లకూ నో అనలేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇరుపక్షాల నడుమ యుద్ధం జరగాలి. అయితే.. ఇది పరిష్కార మార్గం కాదు. కశ్మీర్‌కు పెద్దఎత్తున పర్యాటకులు వెళ్తుంటారు. కాబట్టి.. వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఈ విషయంలో సర్కారు విఫలమైంది. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందారు. అంతకుముందు పుల్వామాలో 40 మంది సైనికులు అమరులయ్యారు. ఈ ఘటనల్లో నిఘా వైఫల్యం ఉంది. ప్రభుత్వం సరైన భద్రత కల్పించలేకపోయింది. అనివార్యమైతేనే యుద్ధం జరగాలి. అస్సలు చేయకూడదని కాదు. కానీ.. తక్షణమే అవసరం లేదు" అని సీఎం సిద్దరామయ్య మీడియాతో తెలిపారు. 'ఎక్స్' వేదికలోనూ ఈమేరకు ఓ పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిపై సిద్దరామయ్య శనివారం మాట్లాడుతూ.. "పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదు. మేం దీనికి అనుకూలం కాదు. శాంతియుత పరిస్థితులు ముఖ్యం. ప్రజలకు భద్రత అవసరం. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి" అని వ్యాఖ్యానించారు. ఇవి కాస్త పాకిస్థాన్ మీడియాలో ప్రసారమయ్యాయి. యుద్ధం విషయంలో సొంత దేశంలోనే వ్యతిరేకత ఉందని ఆ దేశ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. భాజపా సైతం శత్రుదేశానికి కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారంటూ సిద్దరామయ్యపై మండిపడింది. పాక్ ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక ట్వీట్ చేశారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీడీఎస్ భేటీ

భారత్‌పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దుల్లో ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం. మరోవైపు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. సరిహద్దులో పాక్ బలగాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వేళ ఈ వరుస భేటీలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలాఉంటే, పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. వీటిని జీర్ణించుకోలేని పాక్ నేతలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు.

# తిరుమలలో సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే

తిరుమల: తిరుమలలో మే 1 నుంచి సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. జులై 15 వరకు సిఫార్సు లేఖలు అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని వెల్లడించింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా తితిదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు సిఫార్సు లేఖలు రద్దు చేస్తున్నట్లు పేర్కొంది.

*** వీఐపీ బ్రేక్ దర్శనాల్లో మార్పు**



మే 1 నుంచి పరిశీలనాత్మకంగా వీఐపీ బ్రేక్ దర్శనాల్లో మార్పులు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు ఉదయం 6 గంటల నుంచి బ్రేక్ దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయం మే 1 నుంచి జులై 15 వరకు అమలవుతుందని పేర్కొంది.

## పీఎస్ఆర్‌ను కస్టడీకి తీసుకున్న సీఐడీ అధికారులు



విజయవాడ: ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులను సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ముంబయి నటి కాదంబరీ జెత్వానీకి వేధింపుల కేసులో ఆయన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల సీఐడీ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులను అరెస్ట్ చేసి విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. కోర్టు అనుమతించిన నేపథ్యంలో అధికారులు ఆదివారం ఉదయం ఆయన్ను కస్టడీకి తీసుకున్నారు. విజయవాడ జీజీహెచ్‌లో పీఎస్ఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. మూడు రోజుల పాటు సీఐడీ అధికారులు ఆయన్ను విచారించనున్నారు.




## సింహాచలంలో సంప్రదాయబద్ధంగా గంధం అమావాస్య వేడుక

సింహాచలం: విశాఖ జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఆదివారం గంధం అమా వాస్య వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వ హించారు. ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా తీర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కొండ దిగువన వరాహ పుష్కరిణి వద్ద పుణ్యస్నానాలు చేశారు. చెక్క కోలలను అప్పన్న స్వామి ప్రతిరూపంగా నెలకొల్పి పూజలు చేశారు. పండ్లు, ఫలహారాలు, పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో అప్పన్న దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. సింహగిరి మాడ వీధులు, కేశఖండన శాల, గంగధార ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. సింహాచలంలో నేటి నుంచి మే 2 వరకు ఆర్జిత సేవలు రద్దు చేశారు.

## చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది: షర్మిల

- **ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య**
- **ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పందన**
- **లారీతో ఢీకొట్టి, వేటకొడవళ్లతో నరికి చంపడం దారుణమని ఆవేదన**
- **రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలకు ఇది నిదర్శనమని వ్యాఖ్య**
- **ఘటనపై అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్**



కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకు గురికావడం పట్ల ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనపై ఆమె తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. లక్ష్మీనారాయణను అత్యంత కిరాతకంగా లారీతో ఢీ కొట్టించి, ఆపై వేట కొడవళ్లతో నరికి చంపడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దారుణంగా పడిపోయాయో అర్థమవుతోందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి దారుణమైన రీతిలో ఒక రాజకీయ నాయకుడిని హత్య చేయడం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆమె అన్నారు. ఈ హత్యోదంతంపై పోలీసు శాఖ తక్షణమే స్పందించి, అత్యున్నత స్థాయి విచారణ చేపట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన అసలు నిందితులను త్వరితగతిన గుర్తించి, వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆమె పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా నిలుస్తుందని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ మేరకు షర్మిల సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన పోస్టుకు ఏపీ పోలీస్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ లను ట్యాగ్ చేశారు.

## వైకాపా నేతలు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

**: మంత్రి సుభాష్**




రావులపాలెం: వైకాపా నేతలు విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే ఆ పార్టీ నేతలు అసెంబ్లీకి రావట్లేదన్నారు. ఇతరులను జగన్ విమర్శిస్తారని, ఆయన్ని విమర్శిస్తే మాత్రం ఓర్వలేరని అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం లో హైటెక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ టెస్టింగ్ సెంటర్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన పరిశీలించారు. విమర్శలు చేయడమే కాకుండా.. సద్విమర్శలను స్వీకరించడం రాజకీయనాయకుల లక్షణ మని సుభాష్ పేర్కొన్నారు.

## ఏపీలో పలు జీజీహెచ్‌లకు సూపరింటెండెంట్ల నియామకం

అమరావతి: వైద్య కళాశాలల ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రులు, జీజీహెచ్‌ల్లో నియామకాలు చేపట్టింది. కొత్త ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్ల నియామకానికి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాలకు కొత్త ప్రిన్సిపల్‌గా డాక్టర్ సంధ్యాదేవిని నియమించారు. కాకినాడ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్, నెల్లూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాజేశ్వరి నియమితులయ్యారు. దీంతో పాటు పలు నగరాల్లో జీజీహెచ్‌లకు సూపరింటెండెంట్లను నియమించారు. ఒంగోలు జీజీహెచ్‌కు కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యం, శ్రీకాకుళానికి డాక్టర్ అమూల్య, తిరుపతికి డాక్టర్ రాధ, మచిలీపట్నానికి డా.వి. మన్మథరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా.ఎ.వి.రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు 8 మంది ప్రొఫెసర్లకు వైద్యవిద్య అదనపు డైరెక్టర్ హోదాతో పదోన్నతి కల్పించారు.

## తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు...

- **ఈ ఉదయం ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు**
- **విమానాశ్రయంలో భద్రతా సంస్థల ముమ్మర తనిఖీలు**
- **టెర్మినళ్లలో బాంబు నిర్వీర్య దళాల సోదాలు**



కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం కలకలం రేగింది. విమానాశ్రయానికి ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తక్షణమే భద్రతా చర్యలు చేపట్టి, విమానాశ్రయ ప్రాంగణంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. విమానాశ్రయ అధికారుల కథనం ప్రకారం, ఆదివారం ఉదయం కార్యాలయానికి ఒక ఈమెయిల్ అందింది. అందులో విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు సందేశం ఉంది. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు, భద్రతా సంస్థలను అప్రమత్తం చేశారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణమే అదనపు భద్రతా బలగాలను మోహరించారు. సమాచారం అందుకున్న వెంటనే బాంబు నిర్వీర్య దళాలు (బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్) రంగంలోకి దిగాయి. విమానాశ్రయంలోని అన్ని టెర్మినళ్లను, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే, భద్రతా తనిఖీలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారు అనే విషయాలపై సైబర్ క్రైమ్ విభాగం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థలు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ప్రస్తుతానికి విమానాశ్రయం మొత్తం భద్రతా బలగాల పర్యవేక్షణలో ఉంది. తనిఖీలు పూర్తయ్యే వరకు అప్రమత్తత కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తమిళనాడు నేత రాధాకృష్ణన్ భేటీ ..
## 'కరుంగాలి కంబు' బహూకరణ

- **పవన్ కల్యాణ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన తమిళనాడు నేత రాధాకృష్ణన్**
- **పర్యావరణ పరిరక్షణ పోరాటాలను పవన్‌తో పంచుకున్న రాధాకృష్ణన్**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తమిళనాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, రచయిత, పర్యావరణ పోరాట నేత కె.ఎస్. రాధాకృష్ణన్ శనివారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్తమాన తమిళనాడు రాజకీయాలు, భాషా సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలపై చర్చించారు. పర్యావరణ పరమైన విషయాల్లో, రైతాంగ పోరాటం, కన్నగి ఆలయం విషయమై కేరళ ప్రభుత్వంతో సాగిన న్యాయ పోరాటంలో తన పాత్రను రాధాకృష్ణన్ పవన్‌కు తెలియజేశారు. పశ్చిమ కనుమలలో పర్యావరణ పరిరక్షణకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో చేసిన పోరాటాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాజకీయంగా తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి, నెడుమారన్, ఈవీకే సంపత్ లాంటి నాయకులతో ఉన్న అనుబంధాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌ను సత్కరించి 'కరుంగాలి కంబు'ను రాధాకృష్ణన్ బహూకరించారు.

## మాల్దీవుల్లో...
# సేదతీరుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు సేదతీరేందుకు మాల్దీవులకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆ జట్టు యాజమాన్యం అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో వెల్లడించింది. 25వ తేదీన చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత జట్టుకు 2వ తేదీ వరకు మరో మ్యాచ్‌లేదు. దీంతో ఆటగాళ్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయ సిబ్బంది రిఫ్రెష్ అయ్యే విధంగా యాజమాన్యం వారిని మాల్దీవుల ట్రిప్‌కు తీసుకెళ్లింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా పోస్టు చేసింది. ''మాల్దీవుల్లో మా రైజర్స్ కోసం సూర్యుడు, సముద్రం, ఓ టీమ్ రిట్రీట్'' అని క్యాప్షన్‌ను జత చేసింది. ఆటగాళ్లు, సిబ్బంది అక్కడకు చేరుకోగానే ఘన స్వాగతం లభించింది. ఇషాంత్ కిషన్ అక్కడి ప్రకృతి అందాలను చిత్రీకరిస్తున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. ఐపీఎల్ లీగ్ దశ కూడా పూర్తికాకుండానే సన్‌రైజర్స్ జట్టు దేశం దాటి విహారయాత్రకు వెళ్లడంపై కొందరు పెదవి విరుస్తున్నారు. జట్టు ఇప్పటి వరకు కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. దీంతో ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే రానున్న ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించాల్సి ఉంది. ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీయగలదు.



### లఖ్‌నవూను బెంబేలెత్తించిన బుమ్రా..
## ముంబయి వరుసగా ఐదో విజయం

ముంబయి: ఐపీఎల్ 18 సీజన్‌లో తొలుత తడబడ్డ ముంబయి ఇండియన్స్ ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హార్దిక్ సేనకు వరుసగా ఇది ఐదో గెలుపు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో లఖ్‌నవూ సరిగ్గా 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (34; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), నికోలస్ పూరన్ (27; 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), ఆయుష్ బదోని (35; 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), డేవిడ్ మిల్లర్ (24; 16 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఐడెన్ మార్‌క్రమ్ (9), రిషభ్ పంత్ (4), అబ్దుల్ సమద్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (4/22) లఖ్‌నవూ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో మార్‌క్రమ్‌ను ఔట్ చేసి లఖ్‌నవూకు గట్టి షాక్ ఇచ్చిన బుమ్రా.. 16 ఓవర్‌లో మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్ (0)ని పెవిలియన్‌కు పంపాడు. ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అదరగొట్టాడు. విల్ జాక్స్ 2, కోర్బిన్ బాష్ ఒక వికెట్ పడగొట్టారు. లఖ్‌నవూకు 10 మ్యాచ్‌ల్లో ఇది ఐదో ఓటమి.

# డిజైనింగ్ కెరీర్.. డీసెంట్ ఫ్యూచర్

**పది తర్వాత ఏం చదవాలని ఆలోచిస్తున్నారా? ఆసక్తి, సామర్థ్యం, అవకాశాల గురించి ఆలోచించండి. బొమ్మలు వేయడం, క్రాఫ్ట్స్ వంటి వాటి పై ఆసక్తి ఉన్నవారు డిజైన్ కెరీర్ వైపు దృష్టి పెడుతున్నారు. అగ్గిపెట్టెలో పట్టే సిరిసిల్ల చీర గురించి విన్నప్పుడు అది సాధ్యమా అనిపిస్తుంది. ఫలక్‌నుమా ప్యాలెస్ వంటివి చూసినప్పుడు అక్కడి ఇంటీరియర్స్ ఎంతో బాగున్నాయని అనిపిస్తాయి. ఈ జనరేషన్ ఉపయోగించే ఆర్టిఫీషియల్ జెవెలరీ, షూస్, బ్యాగ్స్ వంటివి చూస్తూనే ఉన్నాం. మొఘల్ గార్డెన్స్, బృందావన్ గార్డెన్స్ లాంటివి చూడటానికి రెండు కళ్లు చాలవు. ఒక డిజైనర్ ఆలోచనకు, అతని సృజనాత్మకత తోడైతే అబ్బురపరిచే ఎన్నో అందాలు ఆవిష్కృతమవుతాయి. ఒక సాధారణ వస్తువుకి సృజనాత్మకతను జోడించి ప్రాణం పోస్తే అది మనల్ని ఆకట్టుకోవాల్సిందే. ఇలా డిజైన్ రంగంలో ఇంకా ఎన్నో అవకాశాలున్నాయి. డిజైన్ రంగంలో నెగ్గుకు రావాలంటే కావలసిన సామర్థ్యాల గురించి తెలుసుకుందాం.**



### క్రియేటివిటీ ఉండాలి

- డిజైనింగ్ చేసే స్టూడెంట్స్‌కి ఎంతో ఓపిక ఉండాలి. నచ్చిన డిజైన్, ఫినిష్, కలర్ కాంబినేషన్ వచ్చే వరకు ప్రయత్నించాలి. చూస్తూ బొమ్మలు వేసేవారు ఎక్కువగా ఉంటారు. కానీ చూడకుండా ఒక ఊహకు రూపాన్ని ఇవ్వగలగాలి. చుట్టూ ఉన్న పరిసరాలను క్షుణ్ణంగా గమనించగలగాలి. క్రియేటివ్‌గా ఆలోచించాలి.
- డిజైన్ కోర్సుల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ వంటి డిగ్రీలుంటాయి. ఈ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయి.

### ఉపాధి అవకాశాలు

- డిజైనర్లు, దేశీయ రిటైల్, తయారీ సంస్థలు, బహుళజాతి రిటైల్ సంస్థలు మీడియా/ అడ్వర్టైజింగ్/ పబ్లికేషన్ హౌసెస్, ఎన్జీఓలు, ఎగుమతి సంస్థలు, హౌసింగ్ రంగం, బిజినెస్ కన్సల్టెన్సీలు, స్టార్టప్స్ డిజైన్ గ్రాడ్యుయేట్స్‌కి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి.

### ఫ్యాషన్ డిజైనర్

- **టెక్స్‌టైల్, అప్పారెల్:** అయోధ్య రాముడికి సిరిసిల్ల చీర, సంబల్పూర్ చీర అని వార్తల్లో చూసే ఉంటారు. అలాగే ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వీక్ గురించి కూడా వినే ఉంటారు. సినిమాల్లో కాస్ట్యూమ్ డిజైనర్ అని పేర్లు గమనించే ఉంటారు.
- టెక్స్‌టైల్ ఒక బేసిక్ నీడ్. సుమారు 35 మిలియన్ జనాభాకు ఇది ఉపాధి కల్పిస్తుంది. కాబట్టి ఎకానమీలో ఈ రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. టెక్స్‌టైల్, అప్పారెల్ ఇండస్ట్రీలో అవకాశాలు చాలా ఉన్నాయి. అరవింద్ మిల్స్, గో కలర్స్, ఫ్యాబ్ వరల్డ్ రేమండ్ వర్ధమాన్ టెక్స్‌టైల్ వంటివి ఎన్నో ప్రఖ్యాత కంపెనీలో డిజైనర్‌గా అవకాశం పొందవచ్చు. ఫ్యాషన్ డిజైన్, అప్పారెల్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్ వంటి కోర్సులు చేయవచ్చు.

### యాక్సెసరీస్ డిజైనర్

- ఒకప్పుడు వస్త్రాలపైనే దృష్టి ఉండేది. ఇప్పుడు వాటి మ్యాచింగ్ యాక్సెసరీస్‌కు డిమాండ్ పెరిగింది.
- బ్యాగ్స్, బెల్ట్, నగలు, ఫుట్‌వేర్, లగ్జరీ ఉత్పత్తులు, వెండి సామగ్రి, విలువైన లోహాన్ని ఉపయోగించి తయారు చేసే బహుమతులు, ఇతర వస్తువుల్లో కూడా ఫ్యాషన్ ఉంటుంది. పాదరక్షల తయారీ పట్ల ఆసక్తి ఉన్నవారు అడిడాస్, బాటా వంటి కంపెనీలో అవకాశాలు పొందవచ్చు. నైకా, రిలయన్స్ రిటైల్ ఫ్యాషన్ స్టోర్, స్వరోవ్‌స్కీ ఇతర ఆభరణాలు, రత్నాలు తయారు చేసే సంస్థలో కూడా అవకాశాలు ఉంటాయి.

### కమ్యూనికేషన్ డిజైనర్

- ఎంత మంచి విషయమైనా దాన్ని సరిగ్గా అందరికి అర్థమయ్యేలా చెప్పడం అవసరం.
- యానిమేషన్, వీడియో గ్రాఫిక్స్, స్పెషల్ ఎఫెక్ట్స్‌లో డిగ్రీ ప్రోగ్రామ్‌ల గ్రాడ్యుయేట్లకు భారీ సంఖ్యలో కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వారు ప్రకటనలు, ప్రచురణ, వెబ్ డిజైన్ లేదా చలన చిత్ర పరిశ్రమలో పనిచేయవచ్చు. మల్టీమీడియా, యూజర్ ఇంటర్ఫేస్ (యూ ఐ), యూజర్ ఎక్స్‌పీరియన్స్ (యూఎక్స్), ఇన్ఫోగ్రాఫిక్స్‌లో అవకాశాలు ఉన్నాయి. రాయడంలో నైపుణ్యం ఉన్నవారు ఫ్యాషన్ జర్నలిస్ట్, కాపీ రైటర్, బ్లాగర్, కాలమిస్ట్, క్రిటిక్ (విమర్శకులు) వంటి అవకాశాలు కలవు. ఫొటోగ్రఫీ లేదా వీడియోగ్రఫీలో కూడా మంచి భవిష్యత్తు ఉంది.

### బ్రాండ్ డిజైనర్

- టీవీ లేదా ఏదైనా వస్తువు కొనాలంటే బ్రాండ్ చూస్తాం. బ్రాండ్ వ్యాల్యూని పెంచడానికి, నిలబెట్టడానికి మంచి ప్రొడక్ట్‌కి బ్రాండ్ మేనేజర్ల అవసరం ఉంది. వీరు బ్రాండ్ కి సంబంధించిన ప్రమోషన్, అడ్వర్టైజింగ్ సృజనాత్మకంగా రూపుదిద్దుతూ డిజిటల్ యాప్స్, వెబ్ సైట్, డిజిటల్ క్యాంపెయిన్‌కి దోహదపడతారు. గ్రాఫిక్ డిజైన్, గ్రాఫిక్ కమ్యూనికేషన్ డిజైన్, గ్రాఫిక్ బ్రాండింగ్, విజువల్ కమ్యూనికేషన్, బ్రాండ్ డిజైన్ వంటి కోర్సులు చేసిన వారికి ఇలాంటి అవకాశాలు వస్తాయి.

### ఫ్యాషన్ టెక్నాలజీ అవకాశాలు

- ఫ్యాషన్ టెక్నాలజీ చదివినవారికి కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ (సీఏడీ), గార్మెంట్ నిర్మాణం, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్, ప్రొడక్షన్ ప్లానింగ్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్ టెక్నాలజీ, వెబ్ బేస్డ్ డేటా మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో అవకాశాలున్నాయి.

### ఇంటీరియర్ డిజైనర్

- ఎంత పెద్ద భవనమైనా లేదా చిన్న ఇల్లు అయినా ఎక్కడ ఉండాల్సింది అక్కడ ఉండాలి. ఎన్ని గజాల్లో ఉంది అనే దానితో సంబంధం లేకుండా ఇంటీరియర్ డిజైన్‌కి డిమాండ్ ఉంది.
- ఈ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయి. ఉదాహరణకు ఫర్నిచర్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, కిచెన్ డిజైన్, ఆర్కిటెక్ట్, ప్రొడక్ట్ డిజైన్. ఈ వృత్తిలో రాణించాలనుకునే వారికి కలర్, ఫ్యాబ్రిక్, మెటీరియల్ ఏస్థటిక్ సెన్స్ ఉండటం ఎంతో అవసరం. ఇంటీరియర్ డిజైన్, అర్బన్ ప్లానింగ్, ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి కోర్సులున్నాయి.

### ఇతర అవకాశాలు

- బిజినెస్ అనలిటిక్స్, ఇ-కామర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇన్వెంటరీ కంట్రోల్, సేల్స్ మేనేజ్‌మెంట్, స్టోర్ నిర్వహణ వంటి అవకాశాలకు మేనేజ్‌మెంట్ స్కిల్స్ అవసరం. డిజైన్ అండ్ ఇన్నోవేషన్ పట్ల అభిరుచి ఉన్న వారికి వాస్తవికత, సృజనాత్మకతతో పాటు ప్రొడక్ట్ డిజైన్, ఇన్నోవేషన్ డిజైన్, డిజైన్ రీసెర్చ్ వంటి స్కిల్స్ అవసరం. బోధన పట్ల ఆసక్తి ఉన్నవారు అకడమిక్ వైపు కెరీర్‌ని మలుచుకోవచ్చు.

### డిజైన్ పరీక్షలు

- దేశంలో డిజైన్ కోర్సు చదవాలనుకునే వారు రాసే పరీక్షల్లో ప్రముఖమైనవి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అండ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఎంట్రన్స్ ఎగ్జామ్స్.

### నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)

- ఎన్ఐడీ (https://nid.edu/) 4 సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రాంను ఆఫర్ చేస్తుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లు అహ్మదాబాద్ (125 సీట్లు), ఆంధ్రప్రదేశ్ (75 సీట్లు), హర్యానా (75 సీట్లు), మధ్య ప్రదేశ్ (75 సీట్లు), అస్సాం (75 సీట్లు)లో ఉన్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, యానిమేషన్ ఫిలిం డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిలిం అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ వంటి కోర్సులున్నాయి.
- ప్రవేశ పరీక్ష రెండు రౌండ్లలో జరుగుతుంది. రౌండ్-1 డీఏటీ (డాట్) ప్రిలిమ్స్, రౌండ్-2 డీఏటీ మెయిన్స్. ఏ స్ట్రీమ్‌లో అయినా 12వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ పరీక్ష రాయవచ్చు.
- ప్రిలిమ్స్ 100 మార్కులకు 3 గంటల్లో నిర్వహిస్తారు. దీనిలో ఆప్టిట్యూడ్ అండ్ క్రియేటివ్ డ్రాయింగ్ స్కిల్స్‌ని టెస్ట్ చేస్తారు. మెయిన్స్‌లో స్టూడియో టెస్ట్ అంటే ఇచ్చిన మెటీరియల్‌తో మోడల్ మేకింగ్ వంటి టెస్ట్ జరుగుతుంది. ఈ పరీక్ష మొదటి రౌండ్ డిసెంబర్ చివరిలో లేదా జనవరి మొదటి వారంలో నిర్వహిస్తారు. రెండో రౌండ్ ఏప్రిల్ లేదా మే నెలలో ఉంటుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.